క్లుప్తంగా

17 నుంచి మిర్చి కొనుగోళ్లు ప్రారంభం

టేకులపల్లి: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లిలోని మినీ మార్కెట్ యార్డులో ఈనెల 17 నంచి మిర్చి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇ.నరేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం సిబ్బందితో కలిసి టేకులపల్లి మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రైతులు దూరప్రాంతాలకు వెళ్లి నష్టపోవద్దని, దళారుల చేతుల్లో మోసపోవద్దన్నారు. టేకులపల్లి, ఇల్లెందుతో పాటు ఖమ్మం నుంచి కూడా వ్యాపారులు రానున్నట్లు చెప్పారు.

శ్రీపాల్‌రెడ్డిని గెలిపించండి..

జూలూరుపాడు: పీఆర్‌టీయూ వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పింగిలి శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీఎస్‌పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దామోదర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం జూలూరుపాడులో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి గెలిస్తే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డి.వెంకటేశ్వరరావు, సంజీవరావు, సీహెచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

టేకులపల్లి: ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. రవి, విజయనిర్మల, రవీందర్, మోతీలాల్, రమేష్ బాబు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ


ప్రాజెక్టును తనిఖీ చేస్తున్న షాహిద్ మసూద్

ఇల్లెందు: ఇల్లెందు డంప్ యార్డులోని బయోమైనింగ్ ప్లాంట్ పనితీరును మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ పరిశీలించారు. గురువారం బైపాస్ రోడ్‌లోని ప్లాంట్‌ను సందర్శించి అక్కడి చెత్త శుద్ధిని తనిఖీ చేశారు. మూడు నెలల క్రితం ఈ ప్లాంట్‌ను నెలకొల్పారు. రూ.కోటి వ్యయం చేసి నిర్మిస్తున్న ఈ బయోమైనింగ్ ప్రాజెక్టు ద్వారా మూడు నెలల కాలంలో జరిగిన పనుల బిల్లు చెల్లింపు కోసం ఈ తనిఖీ నిర్వహించారు. ఎస్‌ఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఏఈ శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అతహర్ ఉన్నారు.

వీధి లైట్లు ఏర్పాటు చేయాలి

జూలూరుపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి రాత్రి వేళలో వెళ్లాలంటే వీధి లైట్లు లేక విద్యార్థులు, టీచర్లు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ అన్నారు. గురువారం జూలూరుపాడులో ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక ప్రభుత్వ ఎస్సీ హాస్టల్ నుంచి సుమారు కిలోమీటర్ల ఉన్న కేజీబీవీ వరకు వీధిలైట్లు లేకపోవడంతో రాత్రిపూట చిమ్మచీకటిగా ఉంటోందన్నారు. విద్యార్థులు, సిబ్బందికి ఎమర్జీ ఏర్పడితే రాత్రి సమయంలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కేసు నమోదు

జూలూరుపాడు: తనకు ఆరోగ్యం బాగాలేదని, మద్యం తాగనని చెప్పిన ఓ వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ కథనం ప్రకారం.. కరివారిగూడెం పంచాయతీ తవిసిగుట్టతండాకు చెందిన భూక్యా నాగేశ్వరరావును అదే గ్రామానికి చెందిన బోడా కృష్ణ, బోడా నరసింహా గురువారం మద్యం తాగేందుకు పిలిచారు. దీంతో తనకు ఆరోగ్యం బాగాలేదని, రాలేనని నాగేశ్వరరావు చెప్పడంతో వారిద్దరు దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. బాధితుడి సోదరుడు భీమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● తవిసిగుట్టతండాకు చెందిన బోడా నరసింహారావు ఇంట్లో భోజనం చేస్తుండగా.. అదేగ్రామానికి చెందిన భూక్యా నాగేశ్వరరావు తన ఫోన్‌లో వీడియో చిత్రీకరిస్తున్నాడు. ఈక్రమంలో నరసింహారావు అన్న బోడా కృష్ణ వీడియో ఎందుకు తీసున్నావని నాగేశ్వరరావును ప్రశ్నించడంతో తాను ఇలాగే చేస్తాను ఏం చేసుకుంటావో చేసుకో అని దుర్భాషలాడుతూ దాడి చేశాడు. దీంతో బాధితుడు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

పట్టపగలే చోరీకి యత్నం

పాల్వంచ: తాళం వేసిన ఇంటిపై కన్నేసిన ఓ దొంగ పట్టపగలే చోరీకి యత్నించాడు. స్థానికుల కథనం ప్రకారం.. రాహుల్‌గాంధీనగర్‌లో టీజీ జెన్‌కో ఫైర్‌స్టేషన్ యాదాద్రిలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ఇంటికి తాళం వేసి ఉండడంతో ఓ దొంగ పట్టపగలే చోరీకి యత్నించాడు. తాళాలు పగలగొడుతుండగా.. శబ్దం రావడంతో ఇంటి ఎదురుగా ఉండే వ్యక్తి గమనించి కేకలు వేయడంతో దొంగ గడ్డపార అక్కడే వదిలేసి పరారయ్యాడు.

తొందర పాటు నిర్ణయాలు వద్దు..



- ప్రేమికులపై సోషల్ మీడియా ప్రభావం..
- జీవితంలో స్థిర పడ్డాకే ప్రేమ, పెళ్లి
- పిల్లలను తల్లిదండ్రులు కనిపెట్టాలంటున్న నిపుణులు

నేడు ప్రేమికుల దినోత్సవం..

చాలామంది యువత అవగాహన లేక సోషల్ మీడియా మాయలో పడి చెడుమార్గం పడుతున్నారు. మాటలు, ప్రేమ కబుర్లు వేగంగా జరిగిపోతున్నాయి. మిడిమిడి జ్ఞానంతో ప్రేమ, పెళ్లిళ్లకు ఆకర్షితులై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. పెళ్లి తరువాత కనీసం ఆరు నెలలు కూడా కలిసి ఉండలేకపోతున్నారు. జిల్లాలో ఈ ఏడాదిలో చిన్నచిన్న కారణాలకే 30 జంటలకు విడాకుల ఆలోచన వచ్చిందంటే అర్థం చేసుకోవచ్చు. ప్రేమ, పెళ్లిళ్ల పేరుతో మోసాలకు గురవుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యాన అప్రమత్తత ముఖ్యమని నిపులుణులు సూచిస్తున్నారు.



కొత్తగూడెంటౌన్: నేటి యువతలో ఎక్కువ మంది విద్య, ఉద్యోగం, జీవితంలో స్థిర పడటం వంటి విషయాలపై దృష్టిని సారిస్తుంటే.. మరి కొంతమంది ప్రేమ పేరుతో భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు ఎవరి పనుల్లో వారు బిజీగా ఉండటం మరో కారణం కావడంతో, ఇంట్లో చెప్పేవారు లేక సోషల్ మీడియాతో యువత చెడుమార్గం పడుతున్నారు. కొత్తగూడెం జిల్లాలో 2024 – 2025 ఫిబ్రవరి వరకు దాదాపుగా 30కి పైగా కేసుల్లో ప్రేమ వివాహాలు చేసుకుని విడాకుల కోసం షీటీంను, పోలీసు స్టేషన్, సఖీ కేంద్రాలను సంప్రదించారు. వారిలో 12 మంది తల్లిదండ్రులతో వెళ్లగా మిగతా వారు సఖీ కేంద్రం సంరక్షణలో ఉన్నారు.

కౌన్సెలింగ్‌తో కలిసిపోగా, మరికొందరు విడిపోవడానికే ప్రాధాన్యం ఇచ్చారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ప్రేమికుల విషయంలో ప్రధాన భూమిక పోషిస్తోంది. ఆకర్షణ అని ఒకరు అంటే కాదు ప్రేమ అంటున్నారు. మారుతున్న కాలంతో పాటు ప్రేమను వ్యక్తం చేస్తున్న తీరు మారుతూ వస్తుంది. ఒకప్పుడు ప్రేమించాలంటే మధ్యవర్తి లేదా ప్రేమించిన వ్యక్తితో ధైర్యం చేసి మాట్లాడాల్సి వచ్చేది. అప్పుడు సోషల్ మీడియాల లేదు కాబట్టి ప్రేమలు మనుషులు కలిస్తేనే ప్రేమలు.. కానీ ఇప్పుడు సోషల్ మీడియా ప్రభావంతో ఫేస్‌బుక్, వాట్సాఫ్, ఇన్‌స్టాగాం, ట్విట్టర్ వంటివి అందుబాటులో ఉండి ఫోన్ నంబర్ ఉంటే చాలు పరిచయాలు.. మాటలు, ప్రేమ కబుర్లు ఇలా వేగంగా జరుగుతున్నాయి. చిన్న వయస్సులోనే చదువు మాని అమ్మాయిలు, అబ్బాయిలు ప్రేమ పేరుతో బయట తిరగడం మంచిది కాదు. ఎక్కువగా యువత ఆలోచించి నిర్ణయాలను తీసుకోవాలి. ప్రేమ పేరుతో పెద్దలను ఒప్పించిన జంటలు, ప్రేమ వివాహం చేసుకున్న జంటలు ఒకరినొకరు అర్థం చేసుకోలేక చిన్న కారణాలకే విడిపోతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది.

ప్రేమా, ఆకర్షణా..?

స్వచ్ఛమైన ప్రేమకు నిర్వచనం లేకుండా పోయింది. ప్రేమ పేరుతో ఒక్కటై పట్టుమని ఏడాది కూడా కలిసి ఉండలేక విడిపోతున్నారు. నేటితరం యువత ప్రేమ అనే పేరుతో ఆకర్షణ వలలో పడి ప్రేమించుకుంటున్నారు. ప్రేమనా, ఆకర్షణనా అనే విషయంలో సంపూర్ణంగా ఎవరికీ అవగాహన లేకపోవడంతో ప్రేమ పెళ్లిళ్లు చేసుకుని ఒకరినొకరు అర్థం చేసుకోలేక విడిపోతున్నారు. టీనేజీ వయస్సులో అమ్మాయిలు, అబ్బాయిలు తప్పటగులు వేస్తూ చదువులు మానేసి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

సోషల్ మీడియా ప్రభావంతో..

పాఠశాల వయస్సు నుంచే విద్యార్థులు స్మార్ట్ ఫోన్లు వాడుతున్నారు. ఇన్‌స్టాగాం, ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్‌లలో పరిచయాలు కొందరిని ప్రభావితం చేస్తున్నాయి. చిన్న వయస్సులో రీల్స్ చేస్తూ పరిచయాలు కావడంతో అమ్మాయి, అబ్బాయిలు తమ సమయం అంతా కాలక్షేపానికి కేటాయిస్తున్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాల్సిన వారు ప్రేమ అనే పేరుతో తెలిసీతెలియని వయస్సులో నేడు దారి తప్పి ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రూప్‌లలో ఫొటోలు, వీడియోలను చూసి ఆకర్షితులై కొత్త వ్యక్తులకు పరిచయాలు పెంచుకుని జీవితాలను నాశనం చేసుకునే దాక తెచ్చుకుంటున్నారు. సోషల్ మీడియా మాధ్యమాలను నమ్మి తమ వ్యక్తిగత సమాచారంతో పాటు అన్ని విషయాలను షేర్ చేయడంతో ఎక్కువ సంఖ్యలో మోసపోతున్నారు. ప్రేమ పేరుతో మోసాలకు గురవుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ పోతోంది.

ఆకర్షణకు లోను కావొద్దు..



ఇన్‌స్టాగాం, ఫేస్‌బుక్, సోషల్ మీడియా పరిచయాలకు యువత దూరంగా ఉండాలి. చిన్న వయస్సులో చదువు మాని ప్రేమ పేరుతో తిరగడం మంచిది కాదు. ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. ప్రేమ పేరుతో పెద్దలను ఒప్పించిన జంటలు ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకోవాలి. ప్రేమ పెళ్లిళ్లు చిన్న కారణాలకే విడిపోతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది.

– అబ్దుల్ రెహమాన్, డీఎస్పీ, కొత్తగూడెం

ఆన్‌లైన్ పరిచయాలతో ఇబ్బందులు..



సోషల్ మీడియాలో పరిచయం అయిన వ్యక్తి సమాచారం నిజమా కాదా అని నిర్ధారించుకోవాలి. పరిచయమైన వ్యక్తులు గుడ్డిగా ప్రేమను నమ్మి ఇరు కుటుంబాలకు పక్కన పెట్టి ప్రేమ, పెళ్లిళ్ల చేసుకుంటున్నారు. ఆ తరువాత కొంత కాలానికే విడిపోతున్నారు. పెళ్లికి ముందు ప్రీ మెరిటల్ కౌన్సెలింగ్, న్యాయ సమాచారం తెలుసుకుని పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకోవాలి.

– లక్కినేని సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కొత్తగూడెం

తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి..



సోషల్ మీడియాలో పిల్లలు ఏం చేస్తున్నారని తల్లిదండ్రులు ఎప్పటికీ ఓ కంట కనిపెట్టాలి. యుక్త వయస్సులో తెలిసీతెలియక దారి తప్పుతున్నారని గ్రహిస్తే తక్షణమే వారిని అదుపులో ఉంచాల్సిన బాధ్యత కన్నవారిదే. చదువుకుని జీవితంలో స్థిరపడిన తరువాత ప్రేమ గురించి ఆలోచించాలి. ఎంత వేగంగా పరిచయం అవుతున్నారో అంతే వేగంగా విడిపోతున్నారు. పెళ్లి చేసుకుని విడాకులు తీసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది.

–జులుమూరి సుభాశ్రీ, సఖీ సెంటర్, కొత్తగూడెం

సకాలంలో వైద్యం అందించాలి

కొత్తగూడెంఅర్బన్: అత్యవసర పరిస్థితులున్న గర్భిణులకు సకాలంలో వైద్యం అందించాలని స్టేట్ ట్రైనర్ డాక్టర్లు అఖిల, చైతన్య అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ ఆదేశాల మేరకు 460 మంది ఏఎన్ఎంలకు అధిక ప్రమాద గర్భధారణ నిర్వహణ నియమాలపై ఐడీఓసీలోని సమావేశ మందిరంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గర్భిణికి కొవిడ్ సోకిందా, రక్తహీనత, అధిక రక్తపోటు, మధుమేహం, మూర్ఛ, గత సీజేరియన్ చరిత్ర, గర్భధారణ సమయంలో ఊపిరి ఆడకపోవడం, క్షయ, జ్వరం, పిండం ఎదుగుదల, తదితర అంశాలపై పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు


స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి తెలిపారు. గురువారం గంగబిషన్ బస్తీలో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని పరిశీలించి, వెంటనే సిబ్బందిని పిలిపించి సమస్యను పరిష్కరించారు. ఆ ఏరియాలో కిన్నెరసాని, మిషన్ భగీరథ నీళ్లు వచ్చే విధంగా ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ.. రానున్న వేసవికాలంలో నీటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి..

ఇల్లెందురూరల్: ఎన్నికల సంఘం ఎప్పుడు ఆదేశించినా స్థానిక సంస్థల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రశాంతంగా, సజావుగా ఎన్నికలు సాగేందుకు రాజకీయ పక్షాలు సహకరించాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్థానిక ఎన్నికలపై రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో నిబంధనల ఉల్లంఘన ఎక్కడ జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

‘చలో హైదరాబాద్’ను జయప్రదం చేయండి..


జూలూరుపాడు: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: ఆరు గ్యారంటీల అమలు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈనెల 20న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం జూలూరుపాడు బస్టాండ్ సెంటర్‌లో వాల్ పోస్టర్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్కే ఉమర్, వల్లోజి రమేష్, వెంకయ్య, వెంకటేశ్వర్లు, మాధవరావు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ప్రకటించిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కల్తి సుభద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు వేములవాడ గ్రామంలో న్యూడెమోక్రసీ, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈసం భద్రమ్మ, లక్ష్మి, కుమారి, గురువమ్మ, వీరభద్రమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..


మాట్లాడుతున్న విశ్వనాథం

పాల్వంచరూరల్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. నాగారం గ్రామంలో గురువారం శాఖ గ్రామ మహాసభ పాదిలి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీపీఐ నిత్యం ప్రజలతో మమేకమై ప్రజాసమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సాయిలు, వెంకన్న, సహాయ కార్యదర్శులుగా డేరంగుల రామయ్య, మహంకాళి లాంజర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మా గోడు పట్టించుకోరా?


ఆందోళన చేస్తున్న పెట్రాంచలక గ్రామస్తులు

టేకులపల్లి: బొగ్గు లారీల వల్ల దుమ్ము, ధూళితో రోగాలబారిన పడుతున్నా సింగరేణి ధికారులు పట్టించుకోవడం లేదని బాధిత ప్రజలు ఆందోళన చేపట్టారు. కోయగూడెం ఓపెన్‌కాస్టు ఏర్పడిన 23 ఏళ్ల నాటి నుంచి బొగ్గు రవాణా కారణంగా పెట్రాంచెలక స్టేజీ గ్రామం అస్తవ్యస్తంగా తయారైందని, అధికారులు, పాలకులు మారుతున్నా పట్టించుకోవడం లేదని గురువారం పెట్రాంచెలక స్టేజీలో బాధితులు బొగ్గు లారీలు, టిప్పర్లను రోడ్డుపై నిలిపి ఆందోళన చేపట్టారు.

దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న బోడు ఎస్ఐ పొడిశెట్టి శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రజలతో మాట్లాడారు. సమస్యలను సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్తానని నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. అనంతరం గ్రామస్తులు సింగరేణి జీఎం వీసం కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో వనదేవతలకు పూజలు


టేకులపల్లి: బోడు గ్రామంలో అడవి నుంచి సారలమ్మను తీసుకొస్తున్న పూజారులు

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం శివారు అటవీ ప్రాంతంలో కొలువుదీరిన వన దేవతలు సమ్మక్క, సారలమ్మలను రెండో రోజు గురువారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. బంగారం (బెల్లం), బోనంలను నైవేద్యంగా చెల్లించి మొక్కలు తీర్చుకున్నారు. పలువురు భక్తులు వనంలోనే విడిది ఏర్పాటు చేసుకొని రోజంతా గడిపారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో విక్రయాలు జోరందుకున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ కమిటీ ప్రతినిధులు వలంటీర్ల సహాయంతో జాగ్రత్తలు తీసుకున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించగా బొజ్జాయిగూడెం సబ్‌సెంటర్ సిబ్బంది మందులతో అప్రమత్తంగా ఉన్నారు.

టేకులపల్లి: సమ్మక్క, సారక్క మినీ జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. బోడు, జండాలతండా, కోయగూడెం, మురుట్ల తదితర గ్రామాల్లో మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో సమ్మక్క, సారక్కలను గద్దెల వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి

కొత్తగూడెంఅర్బన్: ఏడాది కాలంగా నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువైందని జైభీమ్‌రావు భారత్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు యర్రా కామేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కాలంలో నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించుకుంటూ, అక్రమ వెంచర్లు, అపార్ట్‌మెంట్ నిర్మాణాలు చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. పాల్వంచలో కలెక్టరేట్ ఎదురుగా అక్రమ వెంచర్లు, చుట్టు పక్కల ప్రాంతంలో అనుమతులు లేని నిర్మాణాలు చేస్తున్నా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

16న టీయూసీఐ జిల్లా మహాసభలు

ఇల్లెందు: టీయూసీఐ జిల్లా మహాసభలు ఈనెల 16న కొత్తగూడెంలో జరగనున్నాయని, ఈ మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సంఘం జిల్లా నాయకులు పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు కోరారు. గురువారం ఇల్లెందులో టీయూసీఐ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సీతారాములు, రవి, ఏలేందర్ పాల్గొన్నారు.

ఖాళీ చేయించండి..

ఇల్లెందు: నిత్యం వందల మంది ఆలయం కోసం రాకపోకలు సాగించే ఈ రహదారిలో ఓ కార్మికుడు అసభ్యపదజాలంతో అందరినీ దూషిస్తున్నాడని, అతని చేష్టలకు తాళలేకపోతున్నామంటూ అక్కడి కుటుంబ సభ్యులు జీఎంకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని అయ్యప్ప టెంపుల్ లైన్‌లో నివాసం ఉంటున్న ఓ సెక్యూరిటీ గార్డు ఎప్పుడూ మద్యం మత్తులో ఉంటున్నాడని పేర్కొన్నారు. అతని క్వార్టర్ ఖాళీ చేయించాలని విన్నవించారు.

రైతులకు మెరుగైన సేవలందించాం..

ఇల్లెందురూరల్: ప్రాథమిక సహకార సంఘం పాలకవర్గ బాధ్యతల్లో కొనసాగిన ఐదేళ్లు రైతులకు మెరుగైన సేవలందించామని పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ అన్నారు. మండలంలోని పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పాలకవర్గం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీసీబీ సహకారంతో రైతులకు ఐదేళ్లలో రూ.6కోట్లు రుణాలు అందజేసినట్లు చెప్పారు.

పుల్లమ్మకు నివాళి

జూలూరుపాడు: వెంగన్నపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి సిద్దంశెట్టి లాలయ్య భార్య పుల్లమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చదువు తలరాత మారుస్తుంది..


మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభుదయాళ్

సింగరేణి(కొత్తగూడెం): పదిలో మంచి ఫలితాలు సాధిస్తే ప్రోత్సాహకాలు అందిస్తామని, విద్యార్థుల తలరాత మార్చేది చదువేనని కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి, రామవరం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ప్రభుదయాళ్ అన్నారు. గురువారం రామవరంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ఆయన సమీక్షించారు. మాట్లాడుతూ... విద్యారంగంలో పదో తరగతి ఫలితాలకు ప్రత్యేకత ఉంటుందని అందుకే నేటి నుంచి ప్రణాళికా బద్ధంగా చదవుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఏ స్థాయి ఉద్యోగ ఎంపికలోనైనా మొదట పరిశీలించేది పదో తరగతి మెమో అని అందుకే చదవుపై దృష్టి సారించాలని చెప్పారు. ఈసారి గ్రేడ్ల విధానం కాదు మార్కుల జాబితాలే వస్తాయన్నారు. 95 శాతంకు పైగా మార్కులు సాధిస్తే, వారికి రూ.పదివేల నూతన వస్త్రాలు తానే స్వయంగా ఇస్తానన్నారు.

క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదగాలి


అథ్లెటిక్స్ ట్రయల్స్‌లో పాల్గొన్న క్రీడాకారులు

పాల్వంచ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అత్యున్నత స్థాయికి ఎదగాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. గురువారం స్థానిక శ్రీనివాస కాలనీ స్టేడియంలో జిల్లా యూత్ అథ్లెటిక్స్ సెలక్షన్ ట్రయల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. క్రీడల్లో రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గెలుపోటములు సహజమని, పోటీతత్వం అలవర్చుకోవాలన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ జి.యుగంధర్‌రెడ్డి, కె.మహీధర్ మాట్లాడుతూ.. పోటీలకు జిల్లా నలుమూలల నుండి 120 మంది హాజరయ్యారని, 30 మందిని ఎంపిక చేసి ఈనెల 18వ తేదీన హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ గ్రౌండ్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి యూత్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌కు పంపిస్తామన్నారు. కోచ్‌లు పి.నాగేందర్, గిరిప్రసాద్, కిరణ్, కృష్ణ, ఉదయ్, ఎర్రయ్య పాల్గొన్నారు.

ఆర్టిజన్లను పర్మనెంట్ చేయండి..

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను వెట్టి చాకిరీ నుంచి విముక్తి చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం పాల్వంచలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్స్ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడారు. కేసీఆర్ హయాంలో ఆర్టిజన్ పేరుతో కార్మికులను శ్రమదోపిడీ చేయించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారి సమస్యలను అర్థం చేసుకుని న్యాయం చేయాలని, కన్వర్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నరాటి ప్రసాద్, బి.అయోధ్య, ఎస్‌కే సాబీర్ పాషా, బానోతు శంకర్, అల్లం ఓదెలు, కోలా శ్యాం, కంచెర్ల జమలయ్య, శంకర్, సారయ్య, బండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు కావలెను..!



మూతపడిన రెడ్డిపాలెం ప్రభుత్వ పాఠశాల, రాంజీతండా పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న టీచర్

విద్యార్థులు లేక ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితి నెలకొంది. సీతంపేట గ్రామ పంచాయతీ రెడ్డిపాలెం గ్రామంలో పిల్లలందరూ ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. ప్రభుత్వ పాఠశాలకు ఎవరూ రావడం లేదు. దీంతో ఇటీవలే ఆ పాఠశాలను మూసివేశారు. ఇదిలా ఉండగా ఇదే గ్రామ పంచాయతీ రాంజీ తండా ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలో ఈ ఏడాది ఒకటో తరగతిలో ఇద్దరు, రెండో తరగతిలో ఒక్కరు ప్రవేశాలు పొందారు. కాగా గురువారం ఒక్క విద్యార్థే పాఠశాలకు రాగా ఆమెకు ఉపాధ్యాయుడు పాఠాలు బోధించాడు.

– సుజాతనగర్